సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 7 । మే । 2023



గుర్తింపు రద్దు చేయాలి

యూనివర్సిటీ అనుమతి లేని గురునానక్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸



పౌష్టికాహారంతో ఆరోగ్యం

పౌష్టికాహారం తీసుకునే మహిళలు, బాలబాలికల ఆరోగ్యం బాగుంటుందని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. 8లో▸

రేపు జైళ్ల శాఖలో పాసింగ్ పరేడ్

చంచల్‌గూడ: చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పరేడ్ మైదానంలో సోమవారం 2వ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ జితేందర్ శనివారం విలేకరులకు తెలిపారు. ఢిల్లీ జైళ్లకు చెందిన వార్డర్లు, శిక్షణ పూర్తి చేసుకున్న పరేడ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

క్రికెట్ ఆడుతూ యువకుడి మృతి

- ఘట్టుపల్లిలో ఘటన
- మృతుడు ప్రకాశం జిల్లావాసి



మణికంఠ మృతదేహం

మహేశ్వరం: క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని ఘట్టుపల్లి శివారులో చోటు చేసుకుంది. సీఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరం గ్రామానికి చెందిన మర్రిపూడి మణికంఠ(26) కోరల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీకెండ్ కావడంతో శనివారం స్నేహితులతో కలసి కోరుపోలు చంద్రారెడ్డి స్టేడియంలో క్రికెట్ ఆడాడు. బౌలింగ్ చేసిన మణికంఠ ఛాతి, వీపులో నొప్పిగా ఉందని స్నేహితులకు చెప్పి కారులో పడుకున్నాడు. కాసేపటికి స్నేహితులు వెళ్లి చూడగా నోటి నుంచి నురగలు వచ్చాయి. ఎంత పిలిచినా పలకకపోవడంతో వెంటనే మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నర్సయ్య కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్

- మీ సేవలో పదో నంబర్ ప్లాట్‌ఫామ్
- సికింద్రాబాద్ స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల కేంద్రం



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్.సి.వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అభయ్ కుమార్ గుప్తా, సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలా రాజారామ్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్ కుమార్ సింగ్ రాథోడ్, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వీఎస్ రామచంద్ర, డాక్టర్ తుషారారామచంద్ర, లయన్ వేణుగోపాల్, 108 సర్వీసెస్ మాజీ సీఈఓ వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ ఈ అత్యవసర వైద్య కేంద్రాన్ని రెండేళ్లపాటు ఉచితంగా నిర్వహించనుంది. 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ ఎమర్జెన్సీ మెడికల్ రూమ్ బుకింగ్ ఆఫీస్ దగ్గర దీనిని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు తమ టిక్కెట్ పీఎన్ఆర్ నంబర్‌తో అత్యవసర వైద్య సహాయం పొందవచ్చు. ఈ సేవలు పూర్తిగా ఉచితం. 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డీఆర్ఎం అభయ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు ఈ ఎమర్జెన్సీ మెడికల్ సౌకర్యం తోడ్పడుతుందని తెలిపారు.

ఓయూలో ముగిసిన సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగిన జాతీయ టెక్నికల్ సింపోజియాలు శనివారం ముగిశాయి. ఏడు ఇంజినీరింగ్ విభాగాల్లో జరిగిన వివిధ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా కొనసాగినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌ను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

మొబైల్ షీ టాయిలెట్లపై పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ అంతటా మొబైల్ షీ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, అలాగే ఆయా వాహనాలు ఉన్న స్థానం, నిర్వహణ సేవల పర్యవేక్షణ కోసం వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సేఫ్ సిటీ ప్రాజెక్ట్ బృందం నిర్ణయించింది. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ నోడల్ అధికారి, హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన శనివారం టీఎస్‌పీఐసీసీసీలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఉమెన్ సేఫ్టీ అదనపు డీజీ శిఖా గోయల్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ట్రై కమిషనర్లలో కొత్త భరోసా కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. అలాగే సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ), పెలికాన్ సిగ్నల్స్, సీసీటీవీ కెమెరాలతో సహా సేఫ్టీ సిటీ ప్రాజెక్టులోని పలు అంశాలపై చర్చించారు.



విద్యార్థులకు వేదపాఠాలు చెబుతున్న గురువులు



గురువులతో వేద విద్యార్థులు

అణువణువునా వేదం

సంస్కృత విద్య, వేదాలు, ఆశ్రమ పాఠశాలలకు నెలవైన దేశం మనది. భారతావని.. వేద భూమి అని ఎంతోమంది రుషులు, యోగులు, ప్రపంచ స్థాయి పరిశోధకులు అనేక సందర్భాల్లో పేర్కొన్నారు. రాచరిక పాలన కాలంలో ప్రత్యేక గురుకుల ఆశ్రమాలు కొనసాగేవి. కానీ ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో వేదం నేర్పేవారితో పాటు నేర్చుకునే వారూ తక్కువయ్యారు. అయితే తను చదివిన వేదాన్ని పది మందికి పంచడం ద్వారా సనాతన సంప్రదాయాలను పరిరక్షించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.. నిత్యఅగ్నిహోత్రి సోమయాజీ శశిభూషణశర్మ.

చిప్పలపల్లి సమీపంలో వేద పాఠశాల

- బ్రాహ్మణ చిన్నారులకు ఉచిత విద్య
- యుద్ధ, సంప్రదాయ కళల్లోనూ శిక్షణ
- నిత్యఅగ్నిహోత్రి శశిభూషణశర్మ ఆధ్వర్యంలో 'విద్యారణ్యమ్'



పూజల్లో విద్యార్థులకు శిక్షణ

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి సమీపంలో తనకున్న 6.30 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని 'విద్యారణ్యమ్' పేరుతో వేద పాఠశాలగా తీర్చిదిద్దారు. మొదట 2015 జూన్‌లో హైదరాబాద్ మల్కాజిగిరిలో ఇద్దరు విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాలను 2018లో ఇక్కడికి మార్చారు. ప్రస్తుతం 82 మందితో స్కూల్ కొనసాగుతోంది. ఆసక్తి ఉన్న 6 నుంచి 8 ఏళ్లలోపు బ్రాహ్మణ పిల్లలకు తన వద్ద ఉచితంగా విద్యనందిస్తున్నారు. వేదం, శాస్త్రం, యజ్ఞాలు, పూజలు, కైంకర్యాలు చేయడం వంటివి అవపోసన పట్టిస్తున్నారు. వేదంతో పాటు అంతే సమానంగా సాధారణ విద్యను అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పది మంది విద్యార్థులు నిష్ణాతులుగా మారి బయటకు వెళ్లారు.

స్వయం గోశాల

వేద విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు స్వచ్ఛమైన పాలు, పెరుగు, నెయ్యి అందించేలా సొంతంగా గోశాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 50 గోవులు ఉండగా, భవిష్యత్‌లో 400 మంది విద్యార్థులకు సరిపడా పాలు అందించేలా 200 గోవులను పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అధ్యాపకులు, సిబ్బందితో కలిసి మొత్తం 21 మంది ఇక్కడ పనిచేస్తున్నారు.

కళల్లోనూ శిక్షణ

వేద విద్యే కాకుండా సంప్రదాయ కళలు, సంగీతం, సాహిత్యంతో పాటు శారీరక పుష్టి కోసం క్రీడలు, ఈత, యుద్ధ కళల్లో సైతం శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు వేద పఠనం కొనసాగిస్తున్నారు.

సండే స్పెషల్

దాతలు సహకరిస్తే..

వేద విద్యను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న తమకు దాతలు సహకరిస్తే సేవలను మరింత విస్తృతం చేసే అవకాశం ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తం 400 మందికి వేద విద్య నేర్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని, దాతలు సహకరిస్తే అందరికీ ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

నిష్ణాతులైన పండితులు

నిత్యం వేదంతో పాటు ప్రతి రోజు గంట చొప్పున సాధారణ విద్యను బోధిస్తున్నారు. నెలలో రెండు అష్టములు, రెండు చతుర్థిలు, రెండు పాఢ్యాలు, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వేదం చదవకూడదని, ఆ రోజుల్లో పూర్తిగా సాధారణ విద్యను నేర్పిస్తున్నారు. వేదం పాఠాలు బోధించేందుకు నలుగురు నిష్ణాతులైన పండితులు ఉన్నారు. సెలవు రోజుల్లో సాధారణ విద్యను చెప్పేందుకు ఐఐటీ, ఇతర అధ్యాపకులు స్వచ్ఛందంగా ఇక్కడికి వస్తారు. 12 ఏళ్ల పాటు వేద విద్య కొనసాగుతుండగా.. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్(ఎన్ఐఓఎస్) ద్వారా ఇంటర్‌తో సమానమైన విద్యను బోధిస్తున్నారు. దీంతో వేద విద్య పూర్తి చేసిన వారు తమకు ఇష్టమైన రంగాల్లో స్థిరపడే వెసులుబాటు కల్పిస్తున్నారు.

నెలకు రూ.6 లక్షల ఖర్చు



వైదిక జీవన విద్యావిధానాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే వేద పాఠశాల ఏర్పాటు చేశా. కంచి మఠం మార్గదర్శనలో ప్రస్తుతం బ్రాహ్మణ పిల్లలు ఎవరు వచ్చినా చేర్చుకుని ఉచితంగా వేద విద్యను అందిస్తున్నాం. ఇందుకోసం ప్రతినెలా సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతోంది. దాతలు సహకరిస్తే ఈ భారం తగ్గే అవకాశముంది. వేద విద్య పూర్తి చేసుకున్న వారు ఇతర రంగాల్లో స్థిరపడినా.. విధాన నిర్ణేతలుగా మారి సమాజానికి ఉపయోగపడాలన్నదే మా లక్ష్యం.

– శశిభూషణశర్మ, వేద పాఠశాల నిర్వాహకుడు

భట్టికి ఘన స్వాగతం



కొత్తగూడెం గ్రామానికి చేరిన భట్టి యాత్ర

- జిల్లాకు చేరుకున్న పీపుల్స్ మార్చ్
- ప్రజల నుంచి విశేష స్పందన

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పురం నుంచి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామంలోకి అడుగుపెట్టింది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి భట్టికి స్వాగతం పలికారు. 7జిల్లాలు, 18 నియోజకవర్గాల మీదుగా 51 రోజుల పాటు యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొత్తగూడెం నుంచి బాటసింగారం, మజీద్‌పూర్, గుంతపల్లి గ్రామాల్లో కొనసాగిన మార్చ్‌కు ప్రజలు, కార్యకర్తల నుంచి విశేష స్పందన లభించింది. బాటసింగారంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ దండెం రాంరెడ్డి, కొత్త కురుమ శివకుమార్, కాంగ్రెస్ సీనియర్ నేత ఈసీ శేఖర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్‌తో పాటు జిల్లా, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి భగ్గుమన్న విభేదాలు..

భట్టి విక్రమార్క పాదయాత్ర జిల్లాలోకి అడుగుపెట్టిన కొద్ది సేపటికే వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. కొత్తగూడెం వద్ద భట్టికి స్వాగతం పలికే సమయంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో పోలీసులు చెదరగొట్టారు.

వృద్ధుల బాధ్యత పిల్లలదే

- కలెక్టర్ హరీష్
- ఫిర్యాదుల వెబ్‌పోర్టల్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: వృద్ధుల పోషణ బాధ్యత పిల్లలదేనని కలెక్టర్ హరీష్ అన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్స్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ ఫిర్యాదుల వెబ్‌పోర్టల్‌ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై ఇందులో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మోతి, సుజని, షభాన, లీగల్ కౌన్సిలర్ విజయభాస్కర్, ఎఫ్ఆర్ఓ నరేష్, హనుమంతు పాల్గొన్నారు.

6.40 లక్షల మందికి నేత్ర చికిత్సలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ, కంటి శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరీష్ ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంత కుమారి శనివారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంతో 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, కంటి వెలుగు శిబిరాల ద్వారా 6.40 లక్షల మందికి పరీక్షలు చేశామని, 89,258 మందికి రీడింగ్ అద్దాలు అందజేశామని సీఎస్‌కు వివరించారు. రెండు రోజుల్లో డబుల్ బెడ్రూంలు పంపిణీ చేస్తామన్నారు. 58 జీఓ కింద 2,394 మందికి ఇప్పటికే పట్టాలు అందజేశామని, మరో 302 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వృద్ధుల ఫిర్యాదుల పోర్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరీష్

మత రాజకీయాలతో చిచ్చు పెట్టొద్దు



చేవెళ్ల బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సీపీఐ నేతలు సాంబశివరావు తదితరులు

- ప్రజలకు ఏం చేశారో చెప్పి.. ఓట్లు అడగండి
- సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు

చేవెళ్ల: ప్రజలకు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని.. కులం, మతం పేరుతో చిచ్చు పెట్టే రాజకీయం వద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సాయంత్రం చేవెళ్లలో నిర్వహించిన పార్టీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోదీ సర్కారు ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేస్తోందని ఆరోపించారు. దేశ సంపద దోచి కార్పొరేట్లకు దోచి పెడుతోందని మండిపడ్డారు. నీతి, నిజాయితీ, నమ్మకానికి ప్రతీక ఎర్ర జెండా అని తెలిపారు. భూసంస్కరణలు, కార్మిక చట్టాలను తీసుకువచ్చిన ఘనత కమ్యూనిస్టులదేనని స్పష్టంచేశారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం ప్రజలకోసం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని చెప్పారు. పేదలకు అన్యాయం జరిగితే పొత్తుల అంశాన్ని సైతం పక్కన పెట్టి.. కేసీఆర్‌ను ఎదిరిస్తామని తెలిపారు. ఉద్యోగ భద్రత కోసం ఆందోళనలు చేస్తున్న వారికి పరిష్కారం చూపాలన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పార్టీ తమదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. లేదంటే ప్రజాక్షేత్రంలో మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు ఈటి నర్సింహ్మా, పానుగంటి పర్వతాలు, పాలమాకుల జంగయ్య, కె.రామస్వామి, రవీంద్రచారి, నర్సింగ్ రావు, సయ్యద్ అఫ్సర్‌ఖాన్, యాదిరెడ్డి, జిల్లా పార్టీ నాయకులు రామక్రిష్ణ, శేఖర్‌రెడ్డి, శ్రీను, జి.జంగయ్య, కిషోర్, రియజ్, వడ్ల సత్యనారాయణ, సత్తిరెడ్డి, శ్రీను, జంగయ్య, మంజుల, సుధాకర్‌గౌడ్, మక్బుల్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువు, విలువలే అసలైన ఆస్తులు

- విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- షాద్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ తమ పిల్లలకు ఇవ్వాల్సిన అసలైన ఆస్తులు చదువు, విలువలేనని మంత్రి సబితారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.55 కోట్లతో చేపట్టిన అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తెలిపారు. పేద విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నామని స్పష్టంచేశారు. ఇందులో భాగంగానే తొమ్మిదేళ్లలో వెయ్యి గురుకుల పాఠశాలలు, 1,200 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, 80 గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో అమ్మాయిలను చదివించేందుకు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో వీరి ఆలోచన ధోరణిలో మార్పు వచ్చిందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా మెరుగైన బోధన అందుతోందని వివరించారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీ మేరకు 3,800 మంది కాంట్రాక్టు లెక్చరర్లను సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పిల్లలకు చదువు, విలువలు లేనప్పుడు ఎంత ధనం కూడబెట్టి ఇచ్చినా ఉపయోగం ఉండదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని సూచించారు. సీఎం కేసీఆర్ వ్యవసాయానికి సైతం తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

నాణ్యత పాటించాలి

మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ స్కూళ్లు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి సబితారెడ్డి అన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు గదుల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ప్రజాప్రతినిధులు, నాయకులు అగ్గనూరు విశ్వం, విశాల, చెట్ల పావని, నర్సింలు, జూపల్లి కౌసల్య, శంకర్, సర్వర్‌పాషా, ప్రేమలత, యుగేంధర్, వెంకట్‌రాంరెడ్డి, నందకిషోర్, కృష్ణవేణి, జమృద్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపల్ భానుప్రకాశ్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, పాల్గుణి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.5 కోట్లు

మహేశ్వరం: ఆలయాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ భారీగా నిధులు విడుదల చేస్తున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయం, ఫ్యాబ్‌సీటీలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, బాలాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, ఆర్‌కేపురంలోని ఖిల్లా మైసమ్మ, జిల్లెల్‌గూడలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయనిస్పష్టంచేశారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి.. ఒకరిని చంపి..

ఆగాపల్లిలో కూలీ హత్య

మంచాల: దొంగతనానికి వచ్చిన దుండగులు.. అక్కడే నిద్రిస్తున్న ఓ కూలీని హత్య చేశారు. ఈ సంఘటన మంచాల మండలం ఆగాపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్ఆర్ పెట్రోల్ బంక్ యజమానికి సంబంధించిన మామిడి తోటలో యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం చిన పడిశాల గ్రామానికి చెందిన రామచంద్రయ్య దంపతులు తోటమాలిగా పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన సుక్క సోమయ్య (70)ను కూలి పని కోసం పిలుపించుకున్నారు. శుక్రవారం రాత్రి భోజనాలు చేశాక.. రామచంద్రయ్య అతని భార్య గదిలో నిద్రించగా.. సోమయ్య మాత్రం వరండాలో నిద్రించాడు. అర్ధరాత్రి కొంతమంది దుండగులు తలుపులు తీయాలని బెదిరించారు. రామచంద్రయ్య దంపతులు భయపడి తలుపులు తీయలేదు. దీంతో ఆగ్రహించిన దుండగులు.. బయట నిద్రిస్తున్న సోమయ్య తలపై బలంగా కొట్టి పరారయ్యారు. వారు వెళ్లిపోయిన తర్వాత తలుపులు తీసి చూడగా.. సోమయ్య తల పగిలి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుండగులు తలపై బలంగా కొట్టడంతో సోమయ్య చనిపోయి ఉంటాడని, అందుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని సీఐ వెంకటేశ్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి దుండగులను పట్టుకుంటామని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి



సమావేశంలో మాట్లాడుతున్న నరహరి

షాద్‌నగర్: మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించి, వారిని చైతన్య పరచాల్సిన బాధ్యత ఆశా వర్కర్లపై ఉందని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. షాద్‌నగర్‌లోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో ఐదు రోజులుగా ఆశా వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆశా వర్కర్లకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్న విషయాన్ని వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్లు విద్యుల్లత, మెర్లిన్ పాల్గొన్నారు.

‘గురునానక్’ గుర్తింపు రద్దు చేయాలి

కళాశాల ఎదుట
ఏబీవీపీ ఆందోళన.. ఉద్రిక్తత



గురునానక్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నేతలు

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ అనుమతులు పొందకుండానే అడ్మిషన్లు తీసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడిన గురునానక్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఆ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీ పేరుతో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులను కళాశాలలో చేర్చుకొని వారి జీవితాలతో యాజమాన్యం చెలగాట మాడుతోందన్నారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ప్రమేయంతో నడుస్తున్న గురునానక్ యూనివర్సిటీ, శ్రీనిధి యూనివర్సిటీల గుర్తింపును రద్దు చేయాలని, ఇందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలపై గవర్నర్ విచారణ జరిపించాలని కోరారు. కాగా, ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నేతలు కళాశాల గేట్ దూకి లోనికి వెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పృథ్వీ, శ్రీరామ్, రాజు, సూర్యప్రకాశ్, సాయిచరణ్, హరిప్రసాద్‌గౌడ్, సిరివెన్నెల, కల్యాణి, వంగ సంజీవరెడ్డి, సందీప్, ప్రదీప్, శశిధర్‌రెడ్డి, జగదీశ్, శివకృష్ణలు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు పెడితే సహించమని బీజేపీ నేతలు టీ.వీరేందర్‌గౌడ్, అర్జున్‌రెడ్డి, అశోక్‌గౌడ్ హెచ్చరించారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించండి

టీపీఎస్ఎఫ్ సోషల్ మీడియా
రాష్ట్ర కన్వీనర్ అశ్వక్ బైగ్

మొయినాబాద్ రూరల్: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని టీపీఎస్ఎఫ్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ అశ్వక్ బైగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వీవోఏల చేపట్టిన సమ్మె శనివారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అశ్వక్ బైగ్, వీవోఏల చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ మాట్లాడారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు లేకపోవడంతో పాలన పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్, శంషాబాద్ మండలం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు. ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కమిటీ సభ్యులు రామకృష్ణ, ఫయాజ్, దివ్య, హరికృష్ణ, మహేందర్‌రెడ్డి, జే శివకుమార్, వాసవిరెడ్డి, హరిశంకర్, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

పెళ్లి పేరిట వేధింపులు

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- పెళ్లయిన వ్యక్తి దురాగతం, కేసు నమోదు

కొందుర్గు: పెళ్లయిన వ్యక్తి ఓ యువతిని పెళ్లి పేరిట వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. బైరంపల్లికి చెందిన పీ శ్రీకాంత్‌కు ఇదివరకే వివాహం జరిగింది. అయితే అదే గ్రామానికి చెందిన మరో యువతి కే అనూష(22)ను ప్రేమ పేరిట వేధించడం మొదలు పెట్టాడు. పెళ్లి చేసుకుంటానని గ్రామంలో చెప్పాడు. అంతేకాకుండా ఆ యువతికి వచ్చిన పెళ్లి సంబంధాలను కూడా చెడగొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం యువతి సోదరుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

కడ్తాల్: ఆమనగల్లు వైపు నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్న పశువుల లారీని కడ్తాల్ టోల్ గేట్ వద్ద స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఏఎస్ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాలు.. ఒడిశాలోని నోరంగపూర్ నుంచి లారీలో 107 పశువులను నగరంలోని బహదూర్‌పూర మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సయ్యద్ హుస్సేన్, క్లీనర్ అర్జున్, లారీ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. అనంతరం పశువులను జియాగూడ గోశాల తరలించారు.